"మరి మీ విలువైన కాలాన్ని ఆవిడ దగ్గర కూర్చుని ఎందుకు వృధా చేసుకుంటున్నారు?"

"దాన్ని దయ అంటారు. భగవత్ భక్తులు దయగా జీవించాలి కాబట్టి." జవాబు చెప్పాడు సన్న్యాసి.

## 182. కదలద్దు

ఓ తాత్త్వికుడు దగ్గరకి కొందరు జిజ్ఞాసువులు వెళ్ళి అతన్ని ఏదైనా ఉపదేశం చెప్పమని కోరారు. అటూ, ఇటూ పచార్లు చేస్తున్న ఆయన కొద్దిసేపు ఆలోచించి కూర్చున్న వాళ్ళతో చెప్పాడు.

"కదలకండి."

"అదేమిటి? మేమెవరం నడవడం లేదు. కూర్చునే వున్నాం. మీరు కదా నడిచేది?" అర్థంకాక అడిగారు వాళ్ళు.

"నా కాళ్ళు కదులుతున్నాయి. కానీ నా మనసు నిశ్చలంగా వుంది. మీ కాళ్ళు నిశ్చలంగా వున్నా, మీ మనసు అన్ని వేళలా ఆశతో, ద్వేషంతో, కోపంతో, సంతోషంతో, దుఃఖంతో, కోరికలతో కదులుతూనే వుంది. నా మనసు విషయంలో నేను నిశ్చలంగా వున్నట్లుగా మిమ్మల్నీ ఉండమంటున్నాను." వివరించాడు ఆ తాత్త్వికుడు.

## 183. ఏకాగ్రత

కొత్తగా ఓ మఠంలో చేరిన ఒకతను ధ్యాన సమయంలో కళ్ళు మూసుకుని దేవుణ్ని మనో నేత్రంతో చూసే ప్రయత్నం చేసేవాడు. ప్రధాన శిష్యుడు ధ్యానం చేసే మిగిలిన శిష్యుల దగ్గరకి వచ్చినప్పుడు వారంతా ఆయన పాదాలకి నమస్కారాలు చేసేవారు. కొత్త శిష్యుడు ఈ పని చేయకపోవడంతో మిగిలిన శిష్యులు గురువుకి అతని మీద ఫిర్యాదు చేసారు. గురువు అతన్ని పిలిపించి ఆ ఫిర్యాదుని ప్రస్తావించి అడిగాడు.